సాక్షి
బాపట్ల

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



గోదావరి ఝరిలా గాత్రకచేరి

చీరాల అర్బన్: సంగీత సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో భాగంగా చీరాలలో శనివారం రాత్రి చెన్నైకు చెందిన ఆదిత్య మాధవన్ గాత్ర కచేరి నిర్వహించారు.



జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి శనివారం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి భారీ విరాళం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండపైన పునఃనిర్మాణం జరుగుతున్న గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయానికి పారిశ్రామికవేత్త, స్పిన్నింగ్ మిల్ అధినేత దండే బ్రహ్మానందం రూ.25 లక్షలు చెక్కును వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం సభ్యులకు అందజేశారు. దాత దండే బ్రహ్మానందంను సభ్యులు సత్కరించారు. దేవాలయ నిర్మాణంలో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు దాత ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పెండేల పుల్లారావు, అధ్యక్షులు పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, ట్రెజరర్‌రెడ్డి నగేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ గంధం బాలిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, గజవల్లి పవన్, దండు చెన్నయ్య, జాగర్లమూడి సుబ్బారావు, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, చందోలు మల్లికార్జునరావు, గోవిందనాయక్, తేలికపల్లి బాబు, అచ్యుత కృష్ణ, కొత్తమాసు శివ, అన్న సుబ్బారావు, బండారు సుబ్బారావు పాల్గొన్నారు.

13 నుంచి విజయకీలాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 18 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు అన్నారు. శనివారం చిన్న జీయర్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆరు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధుసూదనాచార్యులు చలసాని ఆంజనేయులు, రఘునాథాచార్యులు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సమతా దీక్షలో భాగంగా విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సమతా దీక్షను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం సమతా దీక్ష నిర్వహించామని, వేద విద్యార్థులు, అధ్యాపకులు, కోలాట బృందంతో నగర సంకీర్తన నిర్వహించామని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- 11 నుంచి ప్రయోగ పరీక్షలు
- జిల్లాలో 62 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 8175 మంది విద్యార్థులు
- రెండు విడతలుగా నిర్వహణ
- తొలిసారిగా ప్రాక్టికల్ మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి పి.ఎర్రయ్య

బాపట్ల అర్బన్ : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈనెల 11 నుంచి 20 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 8175 మంది ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, బోటనీ విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం 62 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఇంటర్ బోర్డు అధికారులు చురుగ్గా చేస్తున్నారు. రెండు విడతలుగా ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. తొలివిడత ఈనెల 11 నుంచి 15 వరకు, ఒకేషనల్ వారికి విడతలో 5 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయి. గతంలో ప్రాక్టికల్ పరీక్ష ముగిసిన వెంటనే ఆఫ్‌లైన్‌లో మార్కులు వేసి వాటిని భద్రపరిచి బోర్డుకు పంపేవారు. ప్రప్రథమంగా ఈ ఏడాది ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసేలా బోర్డు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పరీక్ష ముగిసిన వెంటనే ఎగ్జామినర్లు అదేరోజు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఎగ్జామినర్లకు పోస్టల్ ద్వారా ఉత్తర్వులు

ఆయా కేంద్రాలకు ఎగ్జామినర్లను బోర్డు అధికారులు నేరుగా నియమించారు. నియామక ఉత్తర్వులను నేరుగా పోస్టల్ ద్వారా పంపనున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే వారికి కనీసం రెండేళ్లు, ప్రైవేట్ కళాశాలల్లో పనిచేసే వారికి కనీసం మూడేళ్ల అనుభవం అర్హతగా పరిగణనలోకి తీసుకున్నారు. అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న కళాశాలల నుంచి అధ్యాపకులను తీసుకున్నారు. ఎవరిని కూడా తను పనిచేస్తున్న కళాశాలలో ఎగ్జామినర్‌గా నియమించరు. ఎగ్జామినర్లను మూడు రోజులకోసారి మార్చుతారు. ఒకసారి నియమించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి నియమించరు. ప్రైవేట్ కళాశాలలు కేంద్రాలుగా ఉన్న వాటికి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించనున్నారు.

పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

పరీక్షల నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించారు. జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) కన్వీనర్, డీవీఈఓ పి.ఎర్రయ్యతోపాటు మెంబర్లు సరస్వతి మెమోరియల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ జి.వేదవతి, రేపల్లె గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.సుధాకర్, రేపల్లె జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్ సతీష్‌బాబు, యద్దనపూడి వై.శ్రీనివాసరావు కమిటీ పర్యవేక్షిస్తారు. ఇద్దరు సభ్యులను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. వీరిలో ఒకరు విద్య, మరొకరు రెవెన్యూ శాఖ నుంచి ఉంటారు. వీరే కాకుండా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీఓలతో పాటు కేంద్రాలున్న ప్రాంతాల తహసీల్దార్లు కూడా పర్యవేక్షిస్తారు.

సమస్య లేకుండా చూస్తాం



జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. తొలిసారిగా పరీక్షలు అయిపోయిన వెంటనే సంబంధిత ఎగ్జామినర్లు మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హాల్ టికెట్ల విషయమై ఒకట్రెండు రోజుల్లో ఆదేశాలు రానున్నాయి.

– పి.ఎర్రయ్య, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి, బాపట్ల

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

- న్యాయమూర్తి కె.పి.బాలాజీ
- 9న జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.పి.బాలాజీ

బాపట్ల: జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీన బాపట్ల జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని బాపట్ల మండల లీగల్ సర్వీసెస్ సెల్ కమిటీ, 6వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.పి.బాలాజీ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి బాలాజీ మాట్లాడారు. క్రిమినల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కువ మొత్తంలో పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ మాట్లాడుతూ న్యాయవాదులు, పోలీసుశాఖ అధికారులు కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు. సమావేశంలో న్యాయవాదులు నందనవనం ప్రసాదరావు, కంచర్ల అవినాష్, ఎస్.రవీంద్రబాబు, సీహెచ్ ప్రేమ్‌చంద్, సీహెచ్.ఆంజనేయులు, కె.రవి, తటవర్తి రామకృష్ణ, సీహెచ్.రాజు, కొసనా వీరశేఖరరావు, వుసా కృష్ణ, మాధురి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా, జేసీ సీహెచ్ శ్రీధర్

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా
- జగనన్నకు చెబుదాంలో అర్జీలు స్వీకరణ

చుండూరు(వేమూరు): ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగనన్నకి చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. వేమూరు నియోజకవర్గం చుండూరు బోస్ రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలు నుంచి ప్రజలు అక్కడకు చేరుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలన్నారు. భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా రావడం జరిగిందన్నారు. వెంటనే రెవెన్యూ శాఖ అధికారులు అర్జీలు పరిష్కరించాలని సూచించారు. జేకేసీ పోర్టల్‌లో ఇప్పటి వరకు 294 అర్జీలను పరిష్కరించామన్నారు. మిగిలిన అర్జీల గడువు తీరినప్పటికీ ఎందుకు పరిష్కరించలేదని అధికారులను ప్రశ్నించారు. 24 అర్జీలు పునరావృతం కావడంపై ఆరా తీశారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల నుంచి అందిన అర్జీలు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, మండల ప్రత్యేకాధికారి జెన్నమ్మ, తహసీల్దార్ దుర్గ, ఎంపీపీ జాలాది రూబేను గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, సుబ్బారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు మానవ వనరులు సమకూర్చుకోవాలి

బాపట్ల: సాధారణ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మానవ వనరులు అధికారులు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో శనివారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి చిత్తశుద్ధితో పనిచేయాలని, నిర్లిప్తత ఉండరాదని పేర్కొన్నారు. సొంత నిర్ణయాలు ఏమాత్రం ఉండరాదన్నారు. జిల్లా అధికారుల అనుమతి లేకుండా ఏ హోదాలో పని చేస్తున్న ఉద్యోగులకు సెలవులు ఇవ్వరాదన్నారు. ముఖ్యంగా సచివాలయాల సిబ్బందికి మూడు నెలలపాటు సెలవులు తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ గెజిటెడ్ అధికారులు, నాన్ గెజిటెడ్ అధికారులు, ఆఫీస్ సబార్డినేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు వేర్వేరుగా ప్రతి శాఖ జిల్లా అధికారులు స్పష్టంగా నివేదిక నివ్వాలని ఆదేశించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, డీఆర్వో పి.వెంకటరమణ ఉన్నారు.

ఎన్‌సీసీ-బి సర్టిఫికెట్‌కు 609 హాజరు

చీరాల 23వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ పరిధిలో నేడు రాత పరీక్ష



ఎన్‌సీసీ క్యాడెట్లకు పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

చీరాలటౌన్: ఎన్‌సీసీ-బీ సర్టిఫికెట్ పరీక్షకు 609 మంది క్యాడెట్లు హాజరయ్యారని 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ గుంటూరు గ్రూప్ వారి సంయుక్త ఆదేశాల ప్రకారం శనివారం చీరాలలో ఎన్‌సీసీ-బీ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు చీరాల, ఒంగోలు, తెనాలి ఎన్‌సీసీ యూనిట్ల నుంచి సుమారు 609 మంది రెండో సంవత్సరం పూర్తిచేసుకున్న క్యాడెట్లు హాజరయ్యారని తెలిపారు. వీటిలో గ్రౌండ్ ప్రాక్టికల్ టెస్ట్, రాత పరీక్ష రెండు విభాగాల్లో జరుగుతుందని తెలిపారు. ఈ రోజు క్యాడెట్లకు గ్రౌండ్ టెస్ట్‌లో భాగంగా డ్రిల్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ మొదలైన అంశాలలో నైపుణ్యతను పరీక్షించామని వివరించారు. ఈ పరీక్షకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా గుంటూరు నుంచి 1వ ఆంధ్ర ఇంజినీరింగ్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సీరజ్కుమార్ వ్యవహరించారన్నారు. క్యాడెట్స్‌కు ఆదివారం రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 23వ ఆంధ్ర బెటాలియన్ ఆర్మీ అధికారులు, వివిధ కళాశాలల ఎన్‌సీసీ అధికారులు, సివిల్ స్టాఫ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టుదలతో శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



చీరాల రూరల్: క్రమశిక్షణతో కూడిన అభ్యాసన సరైన ప్రణాళిక, పట్టుదలతో శ్రమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చనని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో వివిధ ప్రజా సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రూప్–2 శిక్షణ తరగతులలో శనివారం ముఖ్య అతిథిగా కేఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు. ఆయన శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు భారతీయ సమాజం అనే అంశంపై మాట్లాడారు. గ్రూప్–2 పోటీ పరీక్షలకు సుమారుగా లక్షమంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని, ఈనెల 25న ప్రిలిమ్స్ పరీక్ష జరుగనుందని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా చదివితే ఉద్యోగం సాధించవచ్చనని చెప్పారు. చీరాలలో ఇంతపెద్ద ఎత్తున అభ్యర్థులకు శిక్షణనివ్వడంలో కాలేజి యాజమాన్యం పాటు వివిధ ప్రజా సంఘాల వారు సహకరించడం మంచి పరిణామమని కొనియాడారు. కార్యక్రమంలో స్టేట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాయుడు రవికుమార్, కాలేజి కరస్పాండెంట్ శీలం విద్యా సాగర్, ప్రిన్సిపాల్ పి.సునీత, ఏపీ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల అధ్యాపకుల రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి పుష్పరాజు, సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సత్కారించారు.

అనుమానాస్పద స్థితిలో న్యాయవాది మృతి

రామాపురం తీరం వద్ద మృతదేహం



వేటపాలెం: అనుమానాస్పద స్థితిలో చీరాలకు చెందిన ఓ న్యాయవాది మృతి చెందాడు. ఈపురుపాలెం ఎస్ఐ జనార్దన్ కథనం మేరకు.. రామాపురం సముద్రతీరం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని సమాచారం మేరకు అక్కడకు వెళ్లి పరిశీలించగా సముద్రం నుంచి ఒడ్డుకు కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహం కనిపించింది. స్కూటర్‌లో ఉన్న కాగితాల ఆధారంగా చీరాలకు చెందిన న్యాయవాది చెన్నుపాటి నాగేశ్వరరావుగా గుర్తించారు. న్యాయవాది ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడా, లేకా ఇంకేమైన కారణాలు ఉన్నాయా అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇటీవల న్యాయవాది తల్లి మృతి చెందినట్లు సమాచారం.

ప్రతి ఒక్కరికీ అండగా వైఎస్సార్ సీపీ

- సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- పమిడిపాడులో 'పల్లె పల్లెకు హనిమిరెడ్డి'

మేదరమెట్ల: అన్నివర్గాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడులో పల్లె పల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శంగా రాజకీయాల్లో వచ్చినట్లు చెబుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధితో పాటు అందరి ఉన్నతికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్షనాయకులు లేనిపోని మాటలతో మభ్యపెట్టేందుకు ముందుకు వస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అంటేనే అబద్దాలకు కేరాఫ్ అని ధ్వజమెత్తారు. మీ ఇంట్లో మంచి జరిగితే ఓటు వేయండని అని అడిగిన దమ్ము, ధైర్యం ఉన్న ఏకైక సీఎం జగనన్న మాత్రమే అన్నారు. ఇలా దేశంలో ఏ సీఎం అయినా ఇలా అడిగారా అని పేర్కొన్నారు. సీఎం జగన్ అంటేనే ప్రజల మనిషి అని చెప్పారు. ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చేరుకున్న ఆయన మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు ఐదో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని రాఘవరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు విక్రమ్ శ్రీదేవి, సర్పంచి పాలపర్తి అంజలీ శ్రీధర్, ఎంపీటీసీలు పి.అనిల్, సీహెచ్ నిర్మల పాల్గొన్నారు.



పమిడిపాడులో చిన హనిమిరెడ్డితో గ్రామ నాయకులు, అభిమానులు

సీఎం జగన్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు



కళ్లజోళ్లు అందుకున్న గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో 705 మందికి కళ్లజోళ్లు పంపిణీ

చేబ్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితోనే సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడించారు చేబ్రోలులో శనివారం 705 మంది గ్రామస్తులకు కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా గత నెల 25వ తేదీన ఆ గ్రామంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద వైద్య శిబిరాలను నిర్వహించామని.. బజరంగ్ 'నేత్రజ్యోతి' శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులలో 705 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించిన మీదట వారందరికీ ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో శిబిరం వివరాలను మురళీకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్నవారి మెరిట్ లిస్టును విడుదల చేశామని గుంటూరు ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేశామన్నారు. ఉద్యోగాలకు ఎంపికై న వారికి ఈనెల 5న ఉదయం 10 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించారు.

నాగరత్నమ్మ పురస్కారం పూర్వజన్మ సుకృతం

పాత గుంటూరు: తమ జీవితాన్ని సాహిత్య, కళా పోషణకు అంకితం చేసిన విద్యా సుందరి బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం అందుకోవటం పూర్వజన్మ సుకృతమని తమిళనాడులోని శ్రీరంగంకు చెందిన సుప్రసిద్ధ నాదస్వర విద్వాంస దంపతులు పద్మశ్రీ, షేక్ మహబూబ్ సుభాని, కాలేషాబీ దంపతులు పేర్కొన్నారు. శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై విశ్వనాధ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విద్యాసుందరి బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం ప్రదానం సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీవీఐటీ విద్యా సంస్థల ట్రస్ట్ బోర్డు సభ్యురాలు వాసిరెడ్డి అరుణ ప్రియ పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు!

సత్తెనపల్లి: రియల్ ఎస్టేట్ బ్రోకర్ రామకృష్ణ దారుణ హత్య కేసును 24 గంటలు గడవక ముందే పోలీసులు ఛేదించారు. రామకృష్ణ తనకు పరిచయస్తురాలైన నాగలక్ష్మితో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. గతంలో రంగా కాలనీలో ప్లాట్ విక్రయించగా వచ్చిన నగదులో నుంచి ఆమెకు రూ.3 లక్షలు ఇచ్చినట్లు సమాచారం నాగలక్ష్మి కుమారుడు పోతురాజు తనకు రూ.లక్ష ఇవ్వమని కోరుతున్నాడు. అయితే ఇద్దరు కలిసే నిత్యం మద్యం తాగుతుంటారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నాగలక్ష్మికి బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి మద్యం తాగి వస్తానని వెళ్లిన రామకృష్ణ తిరిగి రాలేదు. రామకృష్ణ, పోతురాజు కలసి ఆర్అండ్ బీ బంగ్లా వెనుక వైపు మద్యం తాగారు. వారి మధ్య నగదు విషయం ప్రస్తావనకు రావడంతో తన వద్ద లేవనిచెప్పాడు. దీంతో కోపంతో పోతురాజు తన వద్ద ఉన్న పందులు కోసే కత్తితో రామకృష్ణ గొంతు కోశాడు. ఘటనను తల్లి నాగలక్ష్మికి వివరించాడు. సత్తెనపల్లి పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి కేసును 24 గంటలు గడవక ముందే ఛేదించారు. ప్రస్తుతం వారిరువుర్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో పక్కా ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చూపనున్నట్లు సమాచారం.

ప్రతిభ వెలికితీసేందుకే స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్ష

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వెంకటేష్

చీరాల టౌన్: పేద విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటుగా విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు నిర్వహిస్తున్న ఉపకార వేతనాల పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ సూచించారు. ఈనెల 15న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ఉపకార వేతనాల పరీక్ష వాల్‌పోస్టర్‌ను రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టడంతో పాటుగా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఉపకారవేతనాల పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. ఏపీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు రాయపాటి జగదీష్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, మెమొంటోలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు మార్క్, రత్నరాజు, కరుణాకర్, కృష్ణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటేష్

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

గుంటూరు రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి

కొల్లూరు: వాహన చోదకులు అప్రమత్తతతోనే ప్రమాదాల నివారించవచ్చునని గుంటూరు రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శ్రీవెంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌లో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వాహన చోదకులు తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు, ఇతర ప్రయాణికుల ప్రాణాలను కాపాడే విధంగా ఉండాలంటే నిరంతరం వాహనాలు నడిపే విషయంలో రోడ్డు భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాలను నడిపే సమయంలో ప్రాథమిక నిబంధనలను తప్పనిసరిగా పాటించగలిగితే ప్రమాదాల సంఖ్యను నివారించవచ్చన్నారు. ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు అందించాల్సిన తక్షణ సహాయ, సహకారాలు, ప్రాథమిక వైద్య సేవల గురించి లారీ, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు వివరించారు. అనంతరం వాహన చోదకులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్టీఓ అధికారులు ప్రసన్నలక్ష్మి, అంకమ్మరావు, ఎస్‌బీఐ తెనాలి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కేవీ భరద్వాజ్, ఫిజికల్ ట్రైనర్ శ్రీమన్నారాయణ, పెట్రోల్ బంక్ నిర్వాహకుడు చెరువు భరద్వాజ్, లారీ యూనియన్ అధ్యక్షుడు సుధకర్ పాల్గొన్నారు.



వాహన చోదకులతో ప్రమాదాల నివారణపై ప్రమాణం చేయిస్తున్న కృష్ణవేణి

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

నరసరావుపేట: జిల్లాలోని దివ్యాంగులు, అంధులు, ట్రాన్స్‌జెండర్‌ల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం దివ్యాంగులు, అంధులకు సంబంధించి వారి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ నిర్వహించిన వినూత్న కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దీనికి జిల్లా నలుమూలల నుంచి హాజరైన వారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 70 అర్జీలు అందజేశారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ఇంతటి గొప్ప కార్యక్రమం రూపొందించిన కలెక్టర్‌ను దివ్యాంగులు, అంధులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. సమావేశానికి విచ్చేసిన వారికి భోజన వసతి కల్పించారు.